# వారం వారం

శ్రీశ్రీ

యుద్ధం వెలిసింది. ఇకమీద పత్రికలు వెలుస్తాయి (ఇంకో అర్థంలో). వలిసింగే. ఎన్ని పత్రికలైనా ఇంకా!రావలిసిందే.

అయితే వున్న పత్రికలకే మరిన్ని కార్బన్ కాపీలు కాకుండా స్వతంత్రమైన ఊహలకు రూపం ఇచ్చే పత్రికలు కావాలి. అటువంటివి ఎన్ని వచ్చినా అన్నింటికీ పాఠకులుంటారు.

మనిషికి టైఫాయిడ్ జ్వరం ఎలాంటిదో మానవజాతికి యుద్ధం అలాంటిది.

ఈ రెండుజబ్బులూ నేను పడ్డాను. 1930 ఆగస్టు, సెప్టెంబరునెలలో 63 రోజులు నాకు టైఫాయిడ్ జ్వరం కాసింది. (టైఫాయిడు వ్యాధినుంచి బయటపడ్డవారు లావెక్కుతారనేది నా విషయంలో వర్తించలేదు) కాని ఆ తర్వాత దైహికంగా కాకపోయినా నాలో మానసికంగా అనేకమైన మార్పులు వచ్చాయి. 1930 తర్వాతనే నేను భావకవిత్వానికి స్వస్తిచెప్పి మహాప్రస్థానాది గీతాలు వ్రాశాను.

(ఇది విష్కంభం)

చెప్పవచ్చిందేమిటంటే . గొప్ప జబ్బుపడ్డ తర్వాత మనిషి కోలుకుంటున్నట్లుగా వుంది ప్రస్తుతపు ప్రపంచ స్థితి.

సమరం సాగుతున్న రోజులలోనే ఒకానొక యుద్ధవైరాగ్యం ప్రజలలో వ్యాపించింది. (అధిక లాభపరులు, సామ్రాజ్యవాదులు మొదలయినవారిని మినహాయిస్తూ ఈ మాట చెప్పుకోవాలి.)

ఇది సంధియుగం—అన్ని అర్థాలలోను.

దారులు మారేచోట నిలబడ్డాము. గమనం మాత్రమే కాక గమ్యమూ దిక్కూకూడా నిర్ణయం కావాలి. ఉన్నచోట నిలబడతామని ఎవ్వరూ చెప్పలేరు. వెనక్కి వెళ్లిపోవడమో, సాహసించి ముందుకు సాగిపోవడమో జరగాలి.

జీవితం స్థాణువు కాదు. చలన శీలమైనది.

ఈ యుద్ధజ్వాలలలోతుప్పుపట్టిన అనేకభావాలు దగ్ధమైపోయాయి.

ఒక్క మనదేశం సంగతే ఆలోచిస్తే సైనిక జాతులు, సైనికేతర జాతులు అనే అస్వాభావిక వ్యత్యాసం నశించింది.

స్త్రీలు ఉద్యోగాలకర్హులు కారు!!అనే సంకుచిత దృష్టి సమసిపోయింది.

ఇలాగే ఎన్నో.

అన్నిటికన్నా ముఖ్యం ప్రజలలో ఒక నవ్య చైతన్యం వెల్లివిరుస్తోంది. జనం తండోపతండాలుగా విరుచుకుపడుతున్నారు: విడుదల అయిన రాజకీయ నాయకులనూ, కొత్తఫిల్ములనూ చూడడానికి, ఫుట్‌బాల్ పోటీలవద్ద, కిరసనాయిలు దుకాణాల ముందు. కాలేజీలలో, గ్రంథాలయాలలో విజ్ఞానాపేక్ష.

ప్రజలను జోకొట్టడానికి bread and circuses (తిండి, వినోదాలు) చాలునన్నా డొక జిజ్ఞాసి. నేటి ప్రజల కవి చాలవు. "ఆలోచనల కాహారం"కూడా కావాలి. అటువంటి ఆకలిని తీర్చగల పత్రికలకు ప్రస్తుతం యెంతైనా అగత్యం వుంది.

ఒకపత్రికలోనే అన్ని విషయాలు. ఒక విషయానికి ఒకపత్రిక. ఈ రెండూ అభిలషణీయమైనవే. కాని నాతత్వానికి ఈరెండోరకంనచ్చుతుంది. (మొదటిది నచ్చదని కాదు. అమెరికానుంచి వచ్చే LIFE, TIME వంటి పత్రికలు నాకు చాలా ఇష్టం మాత్రమే కాక అవి బాగులేవనే వారిపట్ల చాలా అనిష్టం.)

అందుకే మరి నేనేం చెయ్యబోతున్నానని యెవరైనా అడిగితే 16 వ పుట చూడవలసిందని కోరుతున్నాను.

ఔను. అదీ నాపై నేను విధించుకున్న కర్తవ్యం.

